
డాక్టర్ లేని దవాఖాన
ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలోని ఓ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. 8లో▸


ధరణితో దగాపడ్డాం
ధరణితో దగాపడ్డామని.. భూ భారతి చట్టంతోనైనా తమకు న్యాయం చేయాలని పలు గ్రామాల రైతులు కోరారు. 8లో▸


ఇష్టారాజ్యంగా..
తాండూరు మండలంలో ధాన్యం సకాలంలో సేకరించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పిన భారత సైన్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మోమిన్‌పేట: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేకవనంపల్లి నుంచి మోమిన్‌పేట, మొరంగపల్లి, వెల్‌చాల్, గోవిందాపూర్ మీదుగా ఎన్కతల గ్రామం వరకు తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలను భారత సైన్యం తుదముట్టించిందన్నారు. అక్కడి పౌరులకు ఇబ్బందులు లేకుండా కేవలం ఉగ్ర స్థావరాలనే టార్గెట్ చేసిందని పేర్కొన్నారు. భారత సైన్యం ముందు నిలువలేక అగ్రరాజ్యం అమెరికా కాళ్లు పట్టుకొందని తెలిపారు. భవిష్యత్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడితే ఇదే విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్ల నందు, మండల అధ్యక్షుడు అశిరెడ్డి, మండల మాజీ అధ్యక్షులు భుజంగ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రమేష్, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాలాలలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 మంది లబ్ధిదారులకు రూ.75.08 లక్షల విలువ చేసే చెక్కులు అందజేసినట్లు వివరించారు. ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ సర్పంచులు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే మన బాధ్యత

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరవణ
- జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

అనంతగిరి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరవణ వైద్యులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు వైద్య ఆరోగ్య శాఖ అందిస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనిచేయడం, ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించడం గురించి ఒక్క రోజు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పీహెచ్‌సీల వైద్యులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, కీటక జనిత వ్యాధులు వంటి కార్యక్రమాల అమలు చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇళ్లల్లోనే ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఇక వేళ బయటికి వెళ్లాల్సి వస్తే ఎండ నుంచి రక్షణ పొందే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఫార్మసీ ఆఫీసర్లకు స్టాక్ నిర్వహణ, పంపిణీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజు, పీఓలు డాక్టర్ పవిత్ర, బుచ్చిబాబు, జానీ, నిరోషా, ప్రవీణ్‌కుమార్, నిఖిల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, స్టాటిస్టికల్ అధికారి నాగమల్లేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, శివశంకర్, జిల్లా పరిధిలోని ఫార్మసీ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట మృత్యుఘోష

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రావెల్స్ బస్సు


మల్లేశ్ (ఫైల్)


సందీప్(ఫైల్)


బాలమ్మ(ఫైల్)


హేమలత(ఫైల్)

- చిన్నవిందుకు హాజరై వస్తుండగా ప్రమాదం
- అక్కడికక్కడే నలుగురు మృతి, 20 మందికి గాయాలు
- పరిగి మండలం రంగాపూర్ వద్ద ఘటన
- మృతుల్లో పెళ్లికొడుకు బావ, మేనబావ

పరిగి: హైదరాబాద్– బీజాపూర్ రహదారి రక్తసిక్తమైంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా 20 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. పెళ్లింట నిర్వహించిన చిన్నవిందుకు హాజరై వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పెళ్లికూతురు, పెళ్లికొడుకుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో షాబాద్ మండలం సీతారాంపూర్‌కు చెందిన మల్లేశ్(35), ఇదే మండలం సోలిపేట్‌కు చెందిన బాలమ్మ (60), చేవెళ్ల మండలం రావులపల్లికి చెందిన హేమలత(32), ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన సందీప్(28) ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరిగి ఆస్పత్రికి అక్కడి నుంచి తాండూరు, హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిగి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని తెలిపారు.

ఎలా జరిగిందంటే..

వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన రామకృష్ణ, స్వప్న దంపతుల కూతురు మల్లేశ్వరిని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లికి చెందిన సతీష్‌కు ఇచ్చి ఈనెల 16న పరిగిలో వివాహం జరిపించారు. 19న చిన్నవిందు ఏర్పాటు చేయడంతో పెళ్లి కొడుకు బంధువులు సుమారు 50 మంది ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో రాత్రి 8:30 గంటలకు చందనవెల్లి నుంచి పరిగికి చేరుకున్నారు. బస్సును పార్కింగ్ చేసి వస్తానని వెళ్లిన డ్రైవర్.. ఇదే ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సు పాడవడంతో అందులో ఉన్నవారిని పరిగి నుంచి వారి గమ్యస్థానంలో వదిలేసి, తిరిగి అర్ధరాత్రి 1:20 గంటలకు పరిగికి చేరుకున్నాడు. పెళ్లికూతురు, పెళ్లికొడుకుతో పాటు బంధువులతో కలిసి చందనవెల్లి బయలుదేరారు. పది నిమిషాలు కూడా గడవకముందే రంగాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న లారీకి సైడ్ ఇచ్చే క్రమంలో రోడ్డు పక్కన ఎడమ వైపు నిలిపి ఉన్న సిమెంట్ లోడ్ లారీని బలంగా ఢీకొట్టింది.

పెళ్లి కొడుకు బావ మృతి

పెళ్లికొడుకు సతీష్ బావ (అక్క భర్త) మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య, ముగ్గురు పిల్లలు సైతం ఇదే బస్సులో ఉన్నారు. మృతుల్లో కిషన్‌నగర్‌కు చెందిన సందీప్‌కు ఆరు నెలల క్రితమే వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం నాగుపల్లికి చెందిన మహేశ్వరితో వివాహం జరిగింది. పెళ్లికుమారుడికి మేనబావ కావడంతో ఏర్పాట్లన్నీ దగ్గరుండి చూసుకున్నారు. ఇతని తండ్రి గతంలోనే మృతిచెందగా ఒకేఒక్క కుమారుడైన సందీప్ అకాల మృతితో అతని కుటుంబం విలవిల్లాడుతోంది.

తల్లి మృతి, ప్రాణాపాయంలో కూతురు


మోక్షిత

ప్రమాద స్థలంలో మృతిచెందిన హేమలత కూతురు మోక్షిత(5)కు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. మిగిలిన వారిని వికారాబద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. సుజాత, నీరజ, నిహారి, మహేశ్, అరుణ, సాహితికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రియాంక, కార్తీక్, రమేశ్, లక్ష్మి, రాములు, మంజుల, సుజాత, నవనీతకు స్వల్ప గాయాలయ్యాయి.


రంగంపల్లి వద్ద ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు

ప్రమాదాల హైవే..!

- నెత్తురోడుతున్న హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారి
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- నిర్లక్ష్యం, అతివేగమే కారణం
- నివారణ చర్యలు చేపట్టని అధికారులు


మన్నెగూడ సమీపంలో ఢీకొన్న వాహనాలు (ఫైల్)

పరిగి: పరిగి డివిజన్ పరిధిలోని హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 59 యాక్సిడెంట్లు జరగ్గా 33 మంది మరణించారు. వంద మందికి పైగా గాయపడ్డారు. తాజాగా మంగళవారం తెల్లవారుజామున రంగాపూర్ సమీపంలో పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు లారీని వెనుక నుంచి ఢీ కొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 20మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ మార్గంలో ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా అధికార యంత్రాంగం నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

నియంత్రణ చర్యలేవీ?

గడిచిన ఆరు నెలల కాలంలో పూడూరు, పరిగి మండలాల పరిధిలోని హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై దాదాపు 50కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. మన్నెగూడ – తుంకిమెట్ల హాట్ స్పాట్‌గా మారింది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. హాట్ స్పాట్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ప్రతి సంవత్సరం జనవరి 11నుంచి 17వ తేదీ వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించే అధికారులు ఆ తర్వాత మిన్నకుండి పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. అడపాదడపా స్కూళ్లు, కళాశాలల్లో అవగాహన కార్యకలాపాలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలు తెలిసినా అక్కడ నివారణ చర్యలు తీసుకోవడం లేదు.

హాట్ స్పాట్లు ఇవే..

ఇటీవల కాలంలో పరిగి మండలంలో రోడ్డు ప్రమదాలు నిత్యకృత్యమయ్యాయి. ఘటన జరిగిన ప్రతిసారీ ఒకరిద్దరు మృత్యుబారిన పడుతునే ఉన్నారు. ఆ సమయంలో హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. పూడూరు మండలం మన్నెగూడ నుంచి బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం వరకు రోజూ యాక్సిడెంట్లు జరుగుతుంటాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పరిగి మండలం హన్మాన్‌గండి సమీపంలో, రంగాపూర్, గడిసింగాపూర్, రంగంపల్లి, సాలిపూలబాట తండా, కొడంగల్‌లోని రేగడిమైలారం, తుంకిమెట్ల, పూడూరు మండలంలోని పూడూరు గేటు, సోమన్‌గుర్తి గేటు, రాకంచర్ల, మీర్జాపూర్ వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్క పరిగి మండలంలోనే జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన 8 రోడ్డు ప్రమాదాల్లో 9మంది మృత్యువాత పడ్డారు. మరో 15మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రమాద స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.



వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మిక సమస్యలు పరిష్కరించండి

- కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్

అనంతగిరి: కార్మిక సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వికారాబాద్ మార్కెట్ యార్డు నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలాగే పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేతనాలు వచ్చేలా చూడాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికారాబాద్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు 8 గంటల పనివిధానం అమలు చేయాలని విన్నవించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు అమృత, భారతి, రేణుక, పెంటమ్మ, నర్సింలు, నీలమ్మ, శంకర్, శివకుమార్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్


నస్కల్ గ్రామంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పరిగి: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ కోసం మంగళవారం నస్కల్ గ్రామంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్థల సేకరణ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే ఎంతో మంది మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. తద్వారా వారి కాళ్లపై వారు నిలబడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ దివ్య, సీసీ రాంచంద్రయ్య పాల్గొన్నారు.

మిల్లులకు ధాన్యం బస్తాలు

ఏడు లారీల ద్వారా 4,500 బ్యాగుల తరలింపు

సాక్షి ఎఫెక్ట్..


మైల్వార్ కొనుగోలు కేంద్రం వద్ద లారీలో ధాన్యం బస్తాలను లోడ్ చేస్తున్న కూలీలు

బషీరాబాద్: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలపై మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో ఎక్కడి వడ్లు అక్కడే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు స్పందించారు. కాశీంపూర్, మైల్వార్, నావంద్గీ, దామర్‌చెడ్ కేంద్రాలకు ఏడు లారీలను పంపారు. కాశీంపూర్ నుంచి 1,410 బస్తాలు, మైల్వార్ నుంచి 1,950, నావంద్గీ, దామర్‌చెడ్ కేంద్రాల నుంచి 1,226 బస్తాల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. మరో 10వేల బస్తాలు ఆయా కేంద్రాల్లోనే ఉన్నట్లు తెలిసింది. ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు కాంట్రాక్టర్‌పై డీఎస్‌ఓ మోహన్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సాక్షి కథనంపై తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తూకం చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్నందున వడ్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డికి ఫోన్ చేసి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. దీంతో వారు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యాన్ని తరలించే ఏర్పాట్లు చేశారు.

బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

మోమిన్‌పేట: విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పని సరిగా రసీదులు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మోమిన్‌పేట రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి, ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన బిల్లులు, ప్యాకెట్ కవర్లను పంట కాలం పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. పంట దెబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. క్యూఆర్ కోడ్ ఉన్న పత్తి విత్తన ప్యాకెట్లనే కొనుగోలు చేయాలన్నారు. డీలర్లు దుకాణంలో ఉన్న స్టాక్, ధరల వివరాలను బోర్డుపై ఉంచాలని ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మోమిన్‌పేట కొనుగోలు కేంద్రంలో సేకరించిన జొన్నలను తాండూరులోని డీసీఎంఎస్ గోదాంకు తరలించాలని సిబ్బందికి సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే పంట దిగుబడి విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయశంకర్, ఏఈఓ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.


జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి


పాల్గొన్న పోలీసు అధికారులు

- సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా పీఎస్‌ల వారీగా నమోదైన కేసుల సంఖ్య, పురోగతిపై సమీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ కళాశాల బృందాలచే ప్రజలకు అవగాహన, ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇసుక, గుట్కా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యత వివరించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా నిఘా పెంచాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడులు నిర్వహించాలని తెలిపారు. తక్కువ ధరకు విత్తనాలు ఇస్తామని చెప్పేవారిని నమ్మవద్దని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని చెప్పారు. త్వరలో బక్రీద్ పండుగ ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని సిబ్బందికి సూచించారు. పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజల సహకారంతో పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ టీవీ హన్మంత్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయండి



రిలే దీక్షలో రైతులు

కొడంగల్: ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామస్తులు కోరారు. మంగళవారం గ్రామంలోని సర్వే నంబర్ 19కు చెందిన రైతులు ఆ భూముల వద్ద రిలే దీక్షలు చేపట్టారు. భూములిచ్చిన రైతులకు పూర్తి పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. తక్షణమే తమకు పరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, మల్లేశ్, ఆశమ్మ, బసప్ప, అమృతప్ప, శేఖర్, నర్సప్ప, రాములు గౌడ్, సావిత్రమ్మ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు బీఎల్‌ఓలను నియమించుకోవాలి

తహసీల్దార్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు ఉంటే సరిచేయించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సమాయత్తమవ్వాలని సూచించారు. ప్రతీ పార్టీ నుంచి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, మాజీ కౌన్సిలర్ మధు యాదవ్, సీపీఐ నాయకుడు ఇందనూర్ బషీర్, ఆసిఫ్ ఖాన్, తలారి శేఖర్, శంకర్‌నాయక్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు సెలవులో ఉన్నా..

- నాపై చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదు
- యాచారం ఎస్‌ఐ మధు

యాచారం: తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది పగడాల శ్రీశైలం తనపై రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని యాచారం ఎస్‌ఐ మధు అన్నారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ.. శ్రీశైలం ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఏప్రిల్ 13, 14 తేదీల్లో తమ కూతురు పుట్టిన రోజు వేడుకలు ఉన్నందున రెండు రోజులు సెలవులో ఉన్నట్లు వివరించారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్: పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ రంగస్వామి సూచించారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర, బక్రీద్ పండుగ, సందర్భంగా పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో మంగళవారం శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరమత సహనం పాటించాలన్నారు. బక్రీద్, హనుమాన్ జయంతి వేడుకలు హిందూ, ముస్లింలు సోదరభావంతో ఐకమత్యంగా జరుపుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పోలీసులకు సహకరించా లని కోరారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, నాయకులు బాబర్‌ఖాన్, ఇబ్రహీం, వెంకటేశ్, జమృద్‌ఖాన్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

డాక్టర్ లేని దవాఖాన

పెద్దల ఇలాకాలో పేదలకు అందని వైద్యం

- నాగసమందర్ పీహెచ్‌ఎస్‌లో డాక్టర్, నాలుగు ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీ
- డిప్యూటేషన్ల పేరిట బదిలీలు
- ఇన్‌చార్జిలుగా వెళ్లేందుకు విముఖత చూపుతున్న వైద్యులు



నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ధారూరు: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా.. శాసనసభాపతి నియోజకవర్గంలోని ఓ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. డాక్టర్లు, ఏఎన్‌ఎంలు డిప్యూటేషన్లపై వెళ్లిపోవడం.. ఖాళీ స్థానాల్లో ఎవరినీ నియామకం చేయక పేదలు ఇబ్బంది పడుతున్నారు.

అదనపు బాధ్యతలకు వెనుకడుగు

మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆరు నెలల క్రితం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రి ఆర్‌ఎంఓగా పనిచేసిన బదిలీపై వచ్చారు. ఇటీవల ఆమె తనకున్న పలుకుబడితో చర్లపల్లి జైలు ఆస్పత్రికి బదిలీ చేయించుకున్నారు. ఆమె స్థానంలో ధారూరు పీహెచ్‌సీ డాక్టర్ శాంతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడే పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ) విధులకు సరిగా హాజరుకాకపోవడం సరికాదని చెప్పడంతో ఆయన డీఎంహెచ్‌ఓతో డాక్టర్ శాంతికి చీవాట్లు పెట్టించినట్లు తెలిసింది. దీంతో మోమిన్‌కలాన్ సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ స్వాతిని నాగసమందర్‌కు పంపడంతో ఆమె రెండు రోజులు విధులు నిర్వహించి విరమించుకున్నారు. అనంతరం కోట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ మేఘనకు శనివారం నాగసమందర్ పీహెచ్‌సీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె బాధ్యతలు స్వీకరించకుండానే విముఖత చూపినట్లు తెలుస్తోంది. పీహెచ్‌సీలో వైద్య సేవలు అందుతాయా లేదా అని రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ పీహెచ్‌సీలో డాక్టర్, స్టాఫ్ నర్స్, ఫార్మాసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రకాశ్ పేర్కొన్నారు.

డిప్యూటేషన్‌పై వెళ్లిపోయిన ఏఎన్‌ఎంలు

నాగసమందర్‌లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంను తాండూర్ మండలం జినుగుర్తి పీహెచ్‌సీకి, తరిగోపుల ఏఎన్‌ఎంను రామయ్యగుడ పీహెచ్‌సీకి, కేరెల్లి ఏఎన్‌ఎంను, కేరెల్లి పల్లె దవాఖానలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీని నాగసమందర్ పీహెచ్‌సీకి, కుక్కింద సబ్ సెంటర్‌లో మూడు పోస్టులు ఖాళీ అయ్యాయి. పల్లె దవాఖాన డాక్టర్‌ను బలవంతంగా బదిలీ చేసి మరో పల్లె దవాఖానకు పంపగా.. సెకండ్ ఏఎన్‌ఎం ధారూరుకు, మొదటి ఏఎన్‌ఎం జినుగుర్తికి డిప్యూటేషన్‌పై పంపారు. ప్రస్తుతం ఆయా సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎంలు లేక వైద్య సేవలు కరువయ్యాయి.

ఏఎన్‌సీ సేవలకు బ్రేక్

ప్రతీ బుధవారం చిన్న పిల్లలకు, గర్భిణులకు టీకా వేయాల్సి ఉంటుంది. ప్రతీ శనివారం సబ్‌సెంటర్ల పరిధిలోని గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. దీంతో పాటు రక్త నమూనాల సేకరణ సేవలు నిలిచిపోయాయని రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను ప్రశ్నించేవారే కరువయ్యారని విచారం వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవలు సరిగా అందక ఆర్‌ఎంపీ డాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈ విషయంలో చొరవ తీసుకుని నాగసమందర్ పీహెచ్‌సీలో డాక్టర్ నియమించడంతో పాటు ఏఎన్‌ఎంలకు ఇచ్చిన డిప్యూటేషన్ ఆర్డర్లు రద్దు చేయించి తిరిగి ఆయా సబ్‌సెంటర్లకు రప్పించాలని కోరుతున్నారు.

ధరణితో దగాపడ్డాం

భూభారతి రెవెన్యూ సదస్సులో ధారూరు దళిత రైతులు



ధారూరులో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సు

ధారూరు: గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో దగాపడ్డామని.. భూ భారతి చట్టంతోనైనా తమకు న్యాయం చేయాలని గ్రామ దళిత రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని బాలికల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే నంబర్ 104లో వచ్చిన ప్రభుత్వ భూములకు సంబంధించిన విస్తీర్ణంలో తేడాలున్నందున తమకు ధరణి పాస్‌పుస్తకాలు ఇవ్వలేదని వాపోయారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ సర్వేనంబర్‌లో 18 మంది దళిత రైతులకు 15.20 ఎకరాల భూములను ఇచ్చారని గుర్తు చేశారు. ఈ భూమిలో కబ్జాలో తక్కువగా ఉంటే ఎక్కువ ఉన్నట్లు, కబ్జాలో ఎక్కువ ఉన్నచోట తక్కువ ఉన్నట్లు ధరణి రికార్డుల్లో నమోదు చేశారని రైతు చంద్రయ్య వివరించారు. కొత్త పాస్‌పుస్తకాలు రాక బ్యాంకు రుణాలు లేక, రైతుబంధు అందక, రుణమాఫీ కాక, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా డబ్బులు రాక నష్టపోతూ వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రైతు మృతి చెందిన తర్వాత వారి వారసులకు విరాసత్ కూడ కాలేదని వాపోయారు. తాము సాగులో ఉన్న భూమిని సర్వే చేయించి అంతమేరకే కొత్త పట్టాలివ్వాలని కోరారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

తుర్కయంజాల్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. పురపాలక సంఘం పరిధిలోని తొర్రూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతో దళారులకు క్వింటా రూ.1,700 రైతులు అమ్ముకుని రూ.600 నష్టపోతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు నోముల దయానంద్ గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహా రెడ్డి, నాయకులు కందాల బల్‌దేవ్ రెడ్డి, పోరెడ్డి అర్జున్ రెడ్డి, కొత్త రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల నిర్వీర్యానికి కేంద్రం కుట్ర



నిరసన ర్యాలీ పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య

పరిగి: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, రైతులకు అన్యాయం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన చట్టాలతో కార్మికులు కట్టుబానిసలుగా మారుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తీరని విషాదం

కన్నీటి సంద్రంలో రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలు

- పలువురు నేతల పరామర్శ

షాబాద్, పరిగి: రంగాపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి స్వగ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన ముత్యాల మల్లేశ్‌కు భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు మాన్యశ్రీ, ఆర్యాధ్య, కూమారుడు ప్రనిల్ ఉన్నారు. మల్లేశ్ మండల పరిధిలోని నాగర్‌గూడలో కులవృత్తి అయిన కటింగ్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మృతి చెందడంతో భార్యాపిల్లలు దిక్కులేనివారయ్యారు. సోలీపేట్‌కు చెందిన మంగలి బాలమ్మకు ముగ్గురు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. అందరి వివాహాలయ్యాయి. చేవెళ్ల మండలం రావులపల్లికి చెందిన హేమలత తన ఇద్దరు పిల్లలను తీసుకుని పెళ్లికి వెళ్లింది. రోడ్డు ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, మోక్షిత నీలోఫర్‌లో చికిత్స పొందుతోంది.

న్యాయం జరిగేలా చూస్తాం..



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మధుసూదన్‌రెడ్డి

రంగాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, డాక్టర్ రాజు, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, నరేందర్, రఫిక్, దయాకర్ తదితరులు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా కృషిచేస్తామని తెలిపారు.

అనాథలయ్యామురా..



తమ్ముడు, తండ్రిని పట్టుకుని విలపిస్తున్న స్వప్న

‘తమ్ముడూ మీ బావ లేడురా.. మనల్ని వదిలి వెళ్లాడురా.. నేను, నా పిల్లలు అనాథలయ్యాముర’.. అంటూ పెళ్లి కుమారుడి (సతీష్) అక్క స్వప్న తన తమ్ముడి పట్టుకుని విలపించింది. తండ్రి రామస్వామి రాగానే నా బతుకు ఆగమయ్యింది నాన్నా అంటూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



ప్రజావేదిక సభ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

- అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదంటూ ఆందోళన
- డీఆర్డీఓ శ్రీలత హామీతో శాంతించిన కూలీలు, ఆందోళన కారులు

యాచారం: ఉపాధి పనుల్లో అవకతవకలు పరిపాటయ్యాయి. మంగళవారం మండల కేంద్రంలో 16వ ఈజీఎస్ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీఓ శ్రీలత, అంబుడ్స్‌మెన్ సునీత, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఏపీడీ చరణ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ శ్రీలత, ఏపీఎం లింగయ్య ఆధ్వర్యంలో ఈ ప్రజావేదిక కొనసాగింది. మండల పరిధిలోని 24 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు రూ.5.5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి కూలీలకు ఉపాధి కల్పించినట్లు గుర్తించారు. పలు గ్రామాల్లో సక్రమంగా రికార్డులు నమోదు చేయకపోవడం, కూలీలు చేసిన పనులకు సకాలంలో డబ్బులు జమకాకపోవడం, ఒకరి పేరు మీద రికార్డులు మరొకరి పేరిట నమోదు చేయడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా డీఆర్డీఓ శ్రీలత మాట్లాడుతూ.. ఉపాధి పనులు కల్పించే విషయంలో గాని, కూలీలకు డబ్బులు ఇచ్చే విషయంలో గాని, స్లిప్పులు అందజేసే విషయంలోగాని తప్పులు చేసిన వారిని వదలమని హెచ్చరించారు. కూలీలకు చేతినిండా పని కల్పించి సకాలంలో డబ్బులు అందించాలన్నదే సర్కార్ లక్ష్యమని చెప్పారు. ఏ గ్రామంలో ఏ తప్పు జరిగిందో.. ఆడిట్ సిబ్బంది గుర్తిస్తున్నారని వివరించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను సాయంత్రం వరకు కేవలం పది గ్రామాల వివరాలనే ఆడిట్ సిబ్బంది వెల్లడించారు.

గోప్యంగా ప్రజావేదిక సభ

ఈజీఎస్ సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక సభ మండల పరిషత్ సమావేశ మందిరంలో పెట్టడంపై కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అంజయ్య మాట్లాడుతూ.. ప్రజావేదిక సభ తేదీని ఈజీఎస్ అధికారులు గోప్యంగా ఉంచారన్నారు. గతంలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై ఎంత మంది మీద చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు రావడం లేదని.. కూలీలు పనులు చేసి పస్తులుంటున్నారని.. పలుమార్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా ఫలితం లేదన్నారు.

మెకానిక్ షెడ్‌లో అగ్ని ప్రమాదం

- ఐదు కార్లు దగ్ధం
- రూ.20 లక్షల నష్టం

షాద్‌నగర్: మరమ్మతుల కోసం తీసుకువచ్చిన కారు నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించి ఐదు కార్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన గణేష్ యాదవ్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో జాతీయ రహదారి పక్కన మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. మరమ్మతుల కోసం వచ్చిన కార్లను షెడ్‌లో ఉంచి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4గంటల ప్రాంతంలో షెడ్‌లో ఉన్న ఓ కారు బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించి ఐదు కార్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకొని మంటలార్పారు. సుమారు రూ.20లక్షల నష్టం వాటినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విమర్శలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు
- డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను నాయకులు తిప్పికొట్టాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తులసీ గార్డెన్‌లో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. పార్టీ కోసం ఏళ్ల నుంచి కష్టపడి పని చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు పదవుల్లో పెద్దపీట వేస్తామన్నారు. పార్టీ పదవులకు ఆశావహులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శాసన సభ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలను హస్తగతం చేసుకున్నామని గుర్తు చేశారు. కార్యకర్తల శ్రమతోనే తాము ఈ రోజు ఎమ్మెల్యేలుగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు, పార్టీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, పార్టీ జిల్లా ఇన్‌చార్జి వినోద్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, అధికార ప్రతినిధి నరేందర్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, ఉత్తమ్‌చంద్, నారాయణరెడ్డి, అజయ్‌ప్రసాద్, ప్రభాకర్‌గౌడ్, గోపాల్, వేణు, మల్లప్ప, ఆయా మండలాల మండల, గ్రామ కమిటీ ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు తదితరులున్నారు.

ఏఎంసీ చైర్మన్ వర్సెస్ డైరెక్టర్లు

- చేవెళ్ల మార్కెట్ కమిటీ పాలకవర్గంలో మనస్పర్థలు
- అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపణలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, సెక్రెటరీ మహేందర్

చేవెళ్ల: చేవెళ్ల మార్కెట్ కమిటీలో చైర్మన్, డైరెక్టర్ల మధ్య సయోధ్య కుదరక రచ్చకెక్కుతున్నారు. తాను మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తుంటే తనపై కుట్రతో ఆరోపణలు చేస్తున్నారని.. డైరెక్టర్లు మార్కెట్ కార్యదర్శి మహేందర్‌కు ఫోన్ చేసి ప్రతీ నెలా డబ్బులివ్వాలని బెదిరిస్తున్నారంటూ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ ఆరోపిస్తుంటే.. చైర్మన్ తమను పట్టించుకోవడం లేదని.. మార్కెట్ కార్యదర్శితో కలిసి అవినీతికి పాల్పడుతున్నారంటూ మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు ఆరోపణలతో వివాదం మొదలైంది.

అభివృద్ధికి సహకరించాలి

చేవెళ్ల మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కార్యదర్శి మహేందర్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కె ట్ కమిటీ డైరెక్టర్లు అసత్య ఆరోపణలతో మార్కెట్‌ను బదనాం చేస్తున్నారని.. వారి సొంత నిర్ణయాలను ప్రశ్నిస్తే ఆరోపణలు చేస్తున్నా రని మండిపడ్డారు. మార్కెట్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సహకారంతో రూ.2 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. కొందరు డైరెక్టర్లు చిన్న విషయాలను రాద్ధాంతం చేస్తున్నారన్నారు. సెక్రటరీకి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడడం, డబ్బులు డిమాండ్ చేయడం, కమీషన్ ఏజెంట్ల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నామంటూ అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. అవి నిజమైతే రుజువు చేయాలని డిమాండ్ చేశారు. పాలకవర్గ సమావేశంలో తీర్మానాలు చేసిన డైరెక్టర్లే తాము చేయ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా డైరెక్టర్లు మార్కెట్ అభివృద్ధికి కలిసిరావాలన్నారు.

పదవులకు రాజీనామా చేస్తాం: డైరెక్టర్లు

మార్కెట్ అభివృద్ధి కోసం చైర్మన్‌ను ప్రశ్నిస్తే తమపై కార్యదర్శితో ఆరోపణలు చేయించడం సరికాదని డైరెక్టర్లు జనార్దన్, మల్లేశ్, నరేందర్, సత్యనారాయణ, హనీఫ్ అన్నారు. మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన వివరాల లెక్కలు అడిగితే తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదిన వేడుకలకు పాలకవర్గాన్ని పట్టించుకోకుండా చైర్మన్ ఒక్కరే తన ఫొటోతో ఫ్లెక్సీలు వేయించుకుని పాలకవర్గాన్ని దూరం పెట్టాడన్నారు. డైరెక్టర్లు లేకుండానే మార్కెట్ కమిటీ సమావేశం నిర్వహించి తాము హాజరైనట్లు రికార్డు చేశారని ఆరోపించారు. కమీషన్ ఏజెంట్లు తక్‌పట్టీలు ఇవ్వడం లేదని చెబితే పట్టించుకోవడం లేదన్నారు. తక్ పట్టీలు ఇవ్వకుండా చైర్మన్, కార్యదర్శి కలిసి అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే డైరెక్టర్లు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపిస్తున్నారని అన్నారు. అవసరమైతే తమ డైరెక్టర్ల పదవులకే రాజీనామాలు చేస్తామన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఆటో ఆకలి కేకల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరుతూ 25 రోజులుగా నిర్వహిస్తున్న ఆటో రథయాత్ర మంగళవారం ఆమనగల్లుకు చేరుకుంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటో రథయాత్రకు స్థానిక ఆటో జేఏసీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద రవి కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోడ్రైవర్లకు ఉపాధి కరువైందని అన్నారు. 83 మంది ఆటోడ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలని, ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు అందించాలని, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 27న జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆటో జేఏసీ నాయకులు